క్లుప్తంగా

ఆలయ పునర్నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులైన భద్రాచలంలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన ఎన్.సుధారాణి, మాధురి రూ.5,116 విరాళం అందజేసినట్లు ఆలయ ఈఓ జి.సుదర్శన్ ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్తులకు అమ్మవారి శేష వస్త్ర ప్రసాదాలను అందజేశారు.

నర్సుల సేవలు వెలకట్టలేనివి



మాతాశిశు ఆస్పత్రిలో వేడుకలు

సింగరేణి(కొత్తగూడెం): అత్యవసర పరిస్థితుల్లో డాక్టర్‌తో సమాన విధులు నిర్వహిస్తూ ఆస్పత్రులను ఎల్లవేళలా కంటికి రెప్పలా కాపాడేది నర్సులేనని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని మాతాశిశు ఆస్పత్రిలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... కొన్ని సమయంలో నర్సులు డాక్టర్లతోపాటు సమాన విధులు నిర్వహిస్తూ డాక్టర్లకు సహాయకారిణిగా ఉపయోగపడుతున్నారని, వారి సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాధామోహన్, అడిషినల్ సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారావు, ఆర్ఎంఓ డాక్టర్ వీరబాబు, డాక్టర్లు పుష్పలత, రాము, ప్రియాంక, సురేందర్, బాబమ్మ, నర్సులు పాల్గొన్నారు.


అసౌకర్యాలకు తావుండొద్దు..



యువ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న విద్యాచందన

ఇల్లెందురూరల్: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అసౌకర్యాలకు తావుండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన ఆదేశించారు. మండలంలో సుభాష్‌నగర్ ఉన్నత పాఠశాలలో యువ పేరుతో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. పోలింగ్‌కు ఉపయోగించే గదులను పరిశీలించారు. ఎండలు మండుతున్నందున పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు నీడ, నీటి సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు ఎవరూ వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం దుర్గారావు, పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల ఓటు ఎటువైపు?



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో సుమారు 39 వేల మంది పర్మనెంట్ కార్మికులు, 2,400 మంది అధికారులు, సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు వారి కుటుంబ సభ్యుల ఓట్లు సుమారు 3.5 లక్షల ఓట్లు రాష్ట్రంలోని ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఓటర్లు ఉన్నారు. వీరి వేసే ఓట్లపై ఫలితాల ప్రభావం ఉంటుందని భావించి వారిని ప్రసన్నం చేసుకునేందుకు పదిరోజుల నుంచి తెలంగాణాలోని ఆరు జిల్లాల్లో విస్తరించిన 18 ఓపెన్‌కాస్ట్, 22 భూగర్భ గనుల్లో మూడు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు పోటా పోటీగా ప్రచారం నిర్వహించారు. మామూలు ప్రజానీకం కంటే సింగరేణి కార్మికుల కమిట్‌మెంట్ ఇస్తే ఆ ప్రాంత ఎంపీ విజయం సాధించినట్లేనన్న అభిప్రాయంలో నేతలున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో సింగరేణి వ్యాపితంగా 12 నియోజకవర్గాలో 11 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించగా ఒకచోట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిచారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి వ్యాపిత ఆరు (ఎంపి) నియోజకవర్గాల్లో విజయం ఎవరిని వరించనుందో వేసి చూడాలి.

లోక్‌సభ ఎన్నికలకు సర్వం సిద్ధం

- ఎన్నికల సామగ్రి పంపిణీ చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాలకు చేరిన ఈవీఎంలు
- ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు
- ఏజెన్సీలో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 4 వరకే పోలింగ్

ఇల్లెందు: మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఇల్లెందు అసెంబ్లీలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లాల్సిన మెటీరియల్‌ను ఎన్నికల సిబ్బంది ఆదివారం పట్టణంలోని సింగరేణి హైస్కూల్ గ్రౌండ్ నుంచి తరలించారు. సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన వేదిక నుంచి తమకు కేటాయించిన మెటీరియల్‌తో వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్లారు. తహసీల్దార్ రవికుమార్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జే.కాశయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రతీ పోలింగ్ బూత్‌లో నలుగురు ఎన్నికల విధులు నిర్వహిస్తారని తెలిపారు. 241 పోలింగ్ కేంద్రాల్లో ప్రతీ పోలింగ్ కేంద్రంలో 200 మంది రిజర్వ్ సిబ్బంది, 600 మంది పోలీసులు బందోబస్తులో ఉంటారని పేర్కొన్నారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో పంచాయతీ సెక్రెటరీ, ఒక పోలీస్, ఆశా వర్కర్, ఏఎన్ఎం, బూత్ లెవల్ ఆఫీసర్, అటెండర్ ఉంటారని చెప్పారు. 37 రూట్లలో 26 సెక్టార్లలో రూట్, సెక్టార్ అధికారుల నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సాగుతుందన్నారు. బస్‌డ్రైవర్లకు, పోలింగ్ అధికారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఈవీఎంలు, పోలింగ్ మెటీరియల్‌ను ఎన్నికల సిబ్బందికి అందజేశారు.



చుంచుపల్లి: రామచంద్ర కళాశాల నుంచి సామగ్రితో బయలు దేరుతున్న ఎన్నికల సిబ్బంది



పెనగడప పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది

ఇల్లెందురూరల్: లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శుక్రవారం సాయంత్రం తెరపడటంతో ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్‌కు తెరలేచింది. మండలంలో ఏర్పాటు చేసిన 80 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఎన్నికల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం జరగనున్న పోలింగ్‌కు అవసరమైన సిబ్బంది ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలం పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలింగ్ సామగ్రితోపాటు భద్రతా సిబ్బంది కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఎన్నికల అధికారులకు గ్రామపంచాయతీ అధికారులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఇదిలా ఉండగా సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించిన పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరగనున్న నేపథ్యంలో మండలంలో సందడి నెలకొంది. ఆదివారం మండలంలోని 44 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది మధ్యాహ్నం తరువాత చేరుకున్నారు. మండలంలో మొత్తం 8 రూట్లను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సంబంధిత శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. టేకులపల్లి సర్కిల్ సీఐ తాటిపాముల సురేష్, ఎస్ఐలు షేక్ సైదా రవూఫ్, పాడిశెట్టి శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారు.

చుంచుపల్లి: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఈవీఎం మిషన్లతో పాటు సామాగ్రిని కొత్తగూడెంలోని రామచంద్ర డిగ్రీ కళాశాల నుంచి వెంట తీసుకొని ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. ఓటర్ల కోసం పోలింగ్ గదిలో విద్యుత్ లైట్లతో పాటు, ఫ్యాన్లు, మంచినీటి సదుపాయాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధులు,గర్భిణీల కోసం ప్రత్యేక సౌకర్యాలు కూడా కల్పించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ భవనాల్లో మరుగుదొడ్లు, మూత్ర శాలలు కూడా ఏర్పాటు చేశారు. ప్రతి స్టేషన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటు వేసే వారికి ఎలాంటి సలహాలు, సూచనలు తెలియజేసే విధంగా సిబ్బందిని కూడా నియమించారు. మండలంలో 41 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు కావల్సిన ఏర్పాట్లు చేపట్టారు. ఇక ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. రాజకీయ పార్టీల వారిని పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల దూరంలో ఉండే విధంగా బందోబస్తుతో 144 సెక్షన్ అమల్లోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీస్ బందోబస్తు కోసం వివిధ రకాల బలగాలను ఏర్పాటు చేశారు. ప్రశాంతమైన పోలింగ్ నిర్వాహణ కోసం 250 మంది అధికారులు, సిబ్బందికి విధులను కేటాయించారు.



ఇల్లెందు: ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తున్న అధికారులు

సుజాతనగర్: నేడు జరగనున్న ఖమ్మం లోక్‌సభ ఎన్నికకు సంబంధించి మండలంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది సామగ్రితో ఆదివారం చేరుకున్నారు. మండలంలో మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 22,294 ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో పురుషులు 10,960, మహిళలు 11,333, ఇతరులు ఒక్కరు ఉన్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో పీఓ, ఏపీఓ, ఓపీఓలు ఇద్దరు చొప్పున నలుగురిని కేటాయించారు. నేటి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరగనుంది. ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు ప్రతీఒక్కరు సహకరించాలని తహసీల్దార్ జి.శిరీష తెలిపారు.

జూలూరుపాడు: సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు ఎన్నికల సంఘం సర్వం సిద్ధం చేసింది. జూలూరుపాడు మండలంలో 28 లోకేషన్లలో 36 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తహసీల్దార్ కె.స్వాతిబిందు ఆదివారం తెలిపారు. మండలంలో మొత్తం 27,632 మంది ఓటర్లు కాగా ఇందులో పురుషులు 13,614 మంది, మహిళా ఓటర్లు 14,018 మంది ఉన్నట్లు చెప్పారు. 150 మంది ఎన్నికల విధులు నిర్వర్తించనున్నారని, ఇతర సిబ్బందిని కూడా నియమించడం జరిగిందన్నారు. మూడు రూట్లు, మూడు సెక్టార్లు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ఇబ్బంది పడకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది..

జూలూరుపాడు మండలంలోని 36 పోలింగ్ స్టేషన్లకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రితో ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. వైరా నుంచి ప్రత్యేక వాహనాల్లో పోలీసు బందోబస్తు నడుమ చేరుకున్నారు.

పాల్వంచ: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. ఈ మేరకు ఆదివారం ఆయా కేంద్రాల వద్దకు పోలింగ్ సిబ్బంది తగు సామగ్రితో చేరుకుని స్థానిక పోలింగ్ ఏజెంట్లకు సూచనలు చేశారు. పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా కేంద్రాల్లో సకాలంలో పోలింగ్ అయ్యేలా తగు జాగ్రత్తలను తీసుకున్నారు. ఎండాకాలం కావడంతో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు వేశారు. తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

పాల్వంచరూరల్: సోమవారం ఉదయం 7గంటలకు పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ మొదలుకానుంది. ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలోని 90 పోలింగ్ కేంద్రాల్లో 33 పోలింగ్ కేంద్రాలు మండల పరిధిలో ఉండగా 57 పట్టణ పరిధిలో ఉన్నాయి. ఇందులో రేగులగూడెం, ఉల్వనూరు, మల్లారం, సత్యనారాయణపురం, మందెరకలపాడు, కారెగట్టు ఆరు గ్రామాల పోలింగ్ కేంద్రాలు నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయి. సాయంత్రం 4 వరకు మాత్రమే పోలింగ్ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివేక్ తెలిపారు. ఆదివారం ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి బయలుదేరిన ఎన్నికల సిబ్బంది



పాల్వంచ: కొమ్ముగూడెంలో...



సుజాతనగర్: సామగ్రితో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



ఇల్లెందు: సింగరేణి స్కూల్ గ్రౌండ్ నుంచి ఈవీఎంలతో వెళ్తున్న పోలింగ్ సిబ్బంది



పోలింగ్ ప్రదేశాలను చూసుకుంటున్న సిబ్బంది



పోలీసులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ



జూలూరుపాడు: సామగ్రితో బయలుదేరిన సిబ్బంది



ఇల్లెందురూరల్: ఒడ్డుగూడెంలో..



పాల్వంచరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో..



ఇల్లెందు: ఈవీఎంలను తరలించేందుకు సిద్ధం చేసిన బస్సులు

పటిష్ట పోలీసు బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రోహిత్‌రాజు తెలిపారు. సోమవారం జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా భద్రతాపరమైన అన్ని రకాల చర్యలను పూర్తి చేసినట్లు ఆదివారం వెల్లడించారు. 2500 మంది పోలీసులతో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జిల్లాలోని 971 పోలింగ్ కేంద్రాలలో జరగనున్న ఓటింగ్‌లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు, మంటను ప్రేరేపించే వస్తువులకు అనుమతి లేదని చెప్పారు. ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ కచ్చితంగా అమలయ్యే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలియజేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాలలో గానీ, పరిసర ప్రాంతాల్లో గానీ ఓటర్లను ప్రలోభ పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఎవరైనా నగదు, మద్యం, ఇతరత్రా వస్తువులను పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి గానీ, సీ-విజిల్ యాప్ ద్వారా గానీ ఫిర్యాదు చేసి సమాచారం అందజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల నుంచి 100 మీటర్ల దూరంలో ఎవరూ ఉండరాదని, ఎన్నికల నియమావళి ప్రకారం పోలీసులు చేపట్టే చర్యలను అతిక్రమిస్తే అట్టి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే పోలింగ్ ప్రక్రియకు ప్రతీఒక్కరు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓట్ల బదలాయింపు జరిగేనా?



ఇల్లెందు: ఓట్ల బదలాయింపు జరుగుతుందని పార్టీలు, నేతలు, అభ్యర్థులు ఆశలు పెంచుకున్నారు. దీనిపైనే గెలుపు, ఓటముల లెక్కలు చెబుతున్నారు. ఓటరు తాను వేయబోయే అభ్యర్థిని ఎంచుకుని ఉన్నాడని, ఎవరు ఎంత ప్రభావితం చేసినా వినడం, డబ్బులు ఇచ్చినా తీసుకోవడం, ఓటు మాత్రం నిర్ణయించుకున్న నేతకు వేసేందుకు పదిలంగా, పటిష్టమైన అభిప్రాయంతో ఉన్నట్లు పరిశీలకులు పేర్కొంటున్నారు. క్రాస్ ఓటింగ్ భారీగా జరుగుతుందని అంచనాలు వేసుకుంటున్నారు. ఎవరికి వారే గెలుపు ధీమాతో లెక్కల్లో తలమునకలవుతున్నారు. మహబూబాబాద్ ఎంపీ స్థానానికి 23 మంది బరిలో ఉండగా, ప్రధానంగా కాంగ్రెస్, టీఆర్ఎస్‌ల మధ్య పోటీ ఉంది. బీజేపీ, మోదీ వల్ల ప్రమాదం ఉందని కాంగ్రెస్, టీఆర్ఎస్ ప్రచారం చేశాయి. రాహుల్‌ను ప్రధానిని చేయటం, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా రుణం తీర్చుకోవటం కాంగ్రెస్ ప్రచారం చేస్తోంది. బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ ప్రధానంగా ప్రచారం చేసింది. గడిచిన నాలుగు నెలల కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు తీవ్ర వ్యతిరేకత పెంచుకున్నట్లు బీఆర్ఎస్ చెబుతోంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే కాంగ్రెస్, బీఆర్ఎస్ బాగా వెనుకబడ్డాయి. ఎన్డీ అభ్యర్థులకు క్రమంగా గ్రామాల్లో తమ ఆధిపత్యం తగ్గుతుండటం, అజ్ఞాతంతో అన్నల అలజడి లేకపోవటంతో పల్లెలు వలసలకు శ్రీకారం చుట్టాయి. బీజేపీ ఆశించినంత ప్రచారం చేయలేకపోయింది. అయితే డబ్బుల ప్రభావం వల్ల అభ్యర్థులకు క్రాస్ ఓటింగ్ బెంగ, భయం, ఆశ నెలకొంది. ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఓటింగ్ సమయం ఆసన్నం కావడంతో టెన్షన్ తీవ్రమైంది. అసెంబ్లీ, లోక్‌సభ, మున్సిపల్, ఎంపీటీసీ, సర్పంచ్ లాంటి ఏ ఎన్నికైనా ఓటరును డబ్బు వైపు లాగుతున్నాయి. అన్ని పార్టీల నుంచి ఓటరు డబ్బు ఇస్తే తీసుకోవాలనే ఆశతో ఎదురుచూడగా కాంగ్రెస్ రెండు వందలు, బీఆర్ఎస్ వంద పంచి చేతులు దులుపుకుంది. బీజేపీ అడ్రస్ లేకుండా పోయింది. డబ్బు ఇవ్వనిదే ఓటు వసే పరిస్థితి లేదు. అయినా ఎవరికి వారే గెలుపు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మహిళా ఓటర్లే కీలకం..

టేకులపల్లి: పార్లమెంట్ ఎన్నికల్లో మండలం నుంచి ఈసారి మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. మొత్తం ఓటర్లు 41,183 మంది ఓటర్లు ఉండగా పురుషులు 20,297, మహిళలు 20,886. అంటే 589 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. గత అసెంబ్లీలో 39,665 ఓటర్లు ఉండగా ఇప్పుడు 1,518 ఓట్లు పెరిగాయి. మండలంలో 131 - 174 నంబర్ల వరకు పోలింగ్ కేంద్రాలు 44 ఉన్నాయి. అత్యధిక ఓటర్లు కోయగూడెంలోని 154వ పోలింగ్ కేంద్రంలో 1,437 ఉండగా, ఆరు వందల లోపు ఓటర్లు మొక్కంపాడు 132వ నంబర్ కేంద్రలో ఉన్నారు. టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ 163వ కేంద్రంలో 544, పాతర్లగడ్డ 135వ కేంద్రంలో 592 మంది ఓటర్లు ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు: ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిబంధనలు ప్రకారం పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంగా రాజకీయ నాయకులు, కార్యకర్తలు ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూ గుంపులుగా ఉండొద్దని చెప్పారు. ఓటు వేసేందుకు వచ్చేవారి వద్ద సెల్ ఫోన్ ఉండరాదని, ఓటరు స్లిప్ తెచ్చుకోవాలని సీఐ సూచించారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 వరకు కొనసాగుతుందన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన పోలీస్ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జూలూరుపాడు మండలంలో పోలింగ్ సజావుగా నిర్వహించేందుకు సీఆర్‌పీఎఫ్, లోకల్ పోలీసులు, ఫారెస్ట్ సిబ్బంది, హోంగార్డులు మొత్తం 75 మందితోపాటు, సీఐ-2, ఎస్ఐ-1, ఏఎస్సై-1, ముగ్గురు హెడ్‌కానిస్టేబుల్స్ శాంతి భద్రతలను పర్యవేక్షించనున్నట్లు సీఐ ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

ఎండను జయించండి..





వేసవితాపాన్ని తీర్చే తాటిముంజలు మార్కెట్‌లో విరివిగా విక్రయిస్తున్నారు. గీత కార్మికులు వేసవిలో వాటిని ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పట్టణాల్లో అమ్ముతున్నారు. ప్రస్తుతం ఎండల తీవ్రత బాగా ఉండడంతో ముంజల వ్యాపారం జోరుగా సాగుతోంది. ఎత్తైన తాటిచెట్టుకు మాత్రమే ప్రతీ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో తాటిముంజలు లభిస్తాయి. ఒక్కో కాయలో మూడు లేదా నాలుగు ముంజలు ఉంటాయి. ములకలపల్లి, జగన్నాథపురం, తదితర ప్రాంతాల నుంచి గీత కార్మికులు పారిశ్రామిక, ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండల, పట్టణ పరిధిలో రోడ్ల వెంట తాటిముంజలను విక్రయిస్తుంచి ఉపాధి పొందుతున్నారు. డజన్ ముంజలు రూ.50 నుంచి 60 చొప్పున విక్రయిస్తున్నారు. ఇలా ప్రతీరోజు రూ.500 - 1000 ఆదాయం వస్తుందని విక్రయదారులు చెబుతున్నారు. ఎన్నికల సీజన్ కావడంతో ప్రచారానికి వచ్చిపోయే నాయకులు, కార్యకర్తలు ముంజలు కొనుగోలు చేస్తున్నారు.

– పాల్వంచరూరల్



తాటిముంజలను విక్రయిస్తున్న దృశ్యం